విమానం యెక్కబోతూనూ

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు

" వెంకయ్యా!"

" ఏమి తల్లీ? "

" ఏమని సెలవు? "

" ఇదిగో కైజారు "

"ఇదుగో కైజారు"

" రాజుగుండెలు తీయడానికేనా? "

" అదెలాగ మాతల్లీ."

"ఏమిా? వెలమబిడ్డను గాదుటోయీా? "

" అది పురుషుల పని తల్లీ!"

" వెలమల ఆడవాళ్లు చేతగానివాళ్లా? "

" స్త్రీలు అసూర్యంపశ్యలు కాదుటమ్మా?

" అంటే ?"

" మీారు బైటికి రాగూడదు. "

" వస్తే? "

"వెలమస్త్రీ పురుషుని కంట పడ్డాక ఇక మాకు మర్యాదయెక్కడిదమ్మా?"

"ఎంత పాపిష్ఠి బ్రతుకోయీా మాదీ? మాలమాదిగల దగ్గిరనుంచి బ్రాహ్మలదాకా అన్నిజాతుల స్త్రీలూ అవసరమైనప్పుడు వీథిలోకివస్తూన్నారంటే వారికి లేని మానభంగం మాకెలా వస్తుందోయీా? "

" మొదటినుంచీ అది మనఆచారం కాదా అమ్మా! "

" స్థితి విషమించినప్పుడు కూడా అంతేనా?"

" తెగించినవాళ్లకి విషమించడం యేమిటి తల్లీ? "

" అదీ మాట, మరి మేము తెగించకూడదూ? "

" అవశ్యమూనూ."

" ఎందుకూ? "

" ప్రభువు ఆజ్ఞ నెరవేర్చడానికి "

"గొంతుకు పిసుక్కో—డానిగ్గాదూ?"

"... ... ..."

"మాట్లాడ వేమోయీ?"

"ఏమి చెప్పను తల్లీ?"

"ఏమి చెబుతావో? ఎంతకర్మమోయీ మాకూ? శత్రువు వచ్చి గొంతుకుమీద కూచున్నప్పుడేనా—మగవాళ్లకి తలదాటి వచ్చినప్పుడేనా—"

"వెలమబిడ్డలికి తలదాటిరావడం యేమిటి తల్లీ?

"అయితే యిప్పుడు నీరాకకిఅర్థంయేమిటీ?

"అది ప్రభువు ఆజ్ఞ."

"అదే నోయీ! ప్రభువు యెందుకిలా ఆజ్ఞాపించవలసివచ్చిందీ?"

"మానభంగం కాకుండా వుండడానికి"

"మానభంగమా?ఎవరికీ? వెలమస్త్రీలకే? ఎంత మాటా? బొబ్బిలి వెలమస్త్రీలకే? మేము యుద్ధంలోకి వెడితే పగవాడు యింతకంటే కఠినంగా మాట్లాడతాడా?"

"తర్కానికిదా సమయం తల్లీ?"

"అది నేనడుగుతూవున్న మ్మాట. వెలమ స్త్రీలు బైటికి రాకూడ దన్నది సామాన్య ధర్మం. స్థితి విషమించినప్పుడు యెందుకు రాకూడదూ?"

"వెలమలు ఇదివరకు చేసిన యుద్ధాల్లో ఎప్పుడేనా స్త్రీలు కత్తిపట్టడం—"

"శత్రువుమాట విని పైవారు కోట విడిచి పొమ్మనడమూ- శత్రువు దుష్ప్రయత్నాలు ఫలించడానికి సిద్ధంగా వుండడమూ—"

"ఒకదాని కొకటి యెప్పుడేనా పోలిక వుంటుందిటమ్మా?"

"మరి ఆమాట యెందుకూ యింకా? అప్పటప్పటి వెలమస్త్రీలు యుద్ధాల్లోకి యెందుకు వెళ్లేరుకాదో మన కేమి తెలుసునూ? కాకపోయినా యిప్పుడు మనకి వచ్చిన అవస్థ వంటి అవస్థలు వారికి వచ్చాయనీ, అయినా అప్పటి వెలమస్త్రీలు యుద్ధంలోకి వెళ్లక అంతఃపురాల్లో పొడుచుకు చచ్చిపోయారనీ నిదర్శనా లేవీ? అవీగాక వారు వీరమాత లైనా వీరాంగన లనిపించుకోవా లని ముచ్చట పడక పోవచ్చు. ఇప్పుడు మేము—నేనలా కాదు. నాశౌర్య మంతా యేమి కానూ? కత్తిపట్టా లని నాకు సరదా పుట్టింది. నేను వీరమాత నగుదునో కాదో తెలవడానికి నా కొడుకు పాలబుగ్గలవా డాయె. నేనువీరవనిత ననిపించుకోవాలి. చిన్నతనములోనే "మల్లమ్మ విచక్షణత కల స్త్రీ" అని పేరు తెచ్చుకున్నాను. నీప్రభువికి తగినస్త్రీ ననిపించుకున్నాను. మరి యింక పూసపాటి విజయరామ రాజుకి కాళికాశక్తి ననిపించుకోవద్దుటోయీ?

"........"

"ఏమంటావు వెంకయ్యా? వెలమల ప్రయత్నాలు—అంటే పురుషుల శౌర్యం నిస్తేజం—"

"ఏమన్నావు తల్లీ?"

"ఉలికిపడకు. నువ్విప్పు డేమి చెయ్యడానికి వచ్చావో తెలుసుకుని మాట్లాడు. చూడూ. బొబ్బిలివెలమవీరుల శౌర్యం నిస్తేజం అయినప్పుడు—"

"వినలేను. అమ్మా! నారక్తాన్ని వేడెక్క-నివ్వవద్దు."

వేడెక్కి-తే విక్రమిస్తావు. స్త్రీలమీద. కదూ వెంకయ్యా? నిజంగా నేడు వెలమ వీరుల రక్తంలో ఉష్ణగుణమే వుంటే యింకా శత్రు వలా కులుకుతూ వుంటాడా? ఏమి దుష్కాలం?

కాలం దుష్టమైపోయింది కనకనే ప్రభువు ఆజ్ఞ యిలా వుంది."

"అలా కాదు. కాలం దుష్టమైపోయింది కనకనే స్త్రీలుకూడా కత్తిపట్టాలి. తెలిసిందా? శ్రీరాజా రావు రంగారావుదొరవారికి నేను ధర్మపత్నినే. నేను వారికి సహధర్మచారిణ్ణనిపించుకోవద్దుటోయీ?"

"కాక యిప్పుడేం లోటువచ్చింది తల్లీ?"

మళ్లీ మొదలూ. ఏమి మిగిలింది నాయనా, బొబ్బిలిరాణీకి మూడువ్రాళ్లు ముండభరణం యిస్తా నన్న రాజు బ్రతికి వుండగా? బొబ్బిలిరాణి—నాకింతకంటె మానభంగం యేమిటోయీ?"

"..........."

మీ ప్రభు వెక్క-డ?"

హాజారంలో—వెలమవీరుల మధ్య—సర్వసన్నద్ధుడై—అంటే అటోయిటో తేల్చివెయ్యడానికి సిద్ధంగా—"

"పోయి యీసంగతి చెప్పిరా."

"ఆజ్ఞ లేదు తల్లీ!"

"పోనీ నేనే వెడతాను. నా కడ్డేమిటి?"

"నీకడ్డేమిటి తల్లీ? అయితే ముందు—ఈ కైజారు పుచ్చుకుని—యిక్క-డ పొడిచి—"

"అది మల్లమ్మ చేసే పని గాదు. నేను కైజారు దూయడమే వస్తే అది రాజు పేగులు బైటికి తియ్యాలి. స్వజనంమీదటోయీ నా ప్రతాపమూ? వెంకయ్యా! నాకింక నా దేవుని దర్శనం లేదూ!"

"ఈక్షుద్రమానవకళేబరం విడిచిపోయిన తరవాత. అది శాశ్వతమే కాదుటమ్మా?"

"ఈకళేబరం వున్నంతసేపే యీపగా, యీకసీసీ"

"వాగ్వాదం చాలించవు తల్లీ?"

"బొబ్బిల్లోని శేరిస్త్రీలు పగవాళ్లని తూనికరాళ్లతో చీకాకుపరిచారుట. వెలమస్త్రీలు ఆమాత్రమేనా కారుటోయీ?"

"..........."

"ఏమంటావు?"

"ప్రభువు వార్తకోసం కనిపెట్టుకొని వుంటాడు"

"చలికాని వెంకయ్య జనానాని నరికేశాడన్న వార్త వినడానిక్కా-దూ? ఏమి కర్మం వచ్చిందోయీ మాకూ? సత్యభామ కాసె బిగించి విల్లు వంచి నరకాసురుణ్ణి గజగజలాడించింది. రాజపుతానాలో క్షత్రియస్త్రీలు ఒక్కొ-క్క-ప్పుడు కత్తిదుయ్యగా తురకసేనలు బేజారైపోయీవి. ఓరుగంటిలో రుద్రమా, పల్నాటిసీమలో నాయకురాలూ కత్తిపట్టగా పరసేనలు చెల్లాచెదరై పోయాయి. మరి బొబ్బిల్లో మల్లమ్మ కైజారుదూస్తే రా జేమయిపోతాడో లోకానికి తెలవనివ్వవుటోయీ?"

"వూహాలతో యేమి లాభం తల్లీ?"

"ఏమిటీ? వూహాలా? అది వెలమల— అంటే వెలమస్త్రీల శక్తి తెలిసినమాటే?"

"..............."

"అయ్యో! ఈ సమయంలో మా అన్నయ్య లేకపోయాడుగదా? తాండ్ర పాపారాయడే వుంటే కార్యం యిలా మించ నిచ్చునా?"

"పాపయ్య కీవార్త తెలిసిందో లేదో?"

"అవును. పాపయ్య కీవార్త తెలిసిందో లేదో? పాపయ్య లేడు. తక్కినవా రంతా? బీరాలు పలికిన వెంగళరావేడీ? చెలికాని వెంకయ్య సంగతి తెలుస్తూనే వుంది. లావు చిన్నయ్య, దామెరదమ్మన్న, పంతెన బుచ్చన్న, ఇనగంటి నరసన్న, కాకర్లపూడి వేంకటరామరాజు ఏరోయీ వీరంతాను? ఏంచేస్తున్నారోయి? రాజు దుర్మరణవార్తనినా చెవిని వెయ్యగల మగవాడు బొబ్బిలికోటలో లేడుటోయీ?"

"..............."

"మాట్లాడకు, కాకపోయినా యేమని మాట్లాడతావ్? కత్తిదూసి జనానామీదకి వచ్చావు. మంచిపని పెట్టేడు ప్రభువు నీకు. నాయనా! వెలమస్త్రీలకు పగవాళ్లని పొడవడానికి వీల్లేకపోయినా సొంతంగా పొడుచుకోడానికేనా అవకాశం వుండనియ్యి. నూరు కుటుంబాల వెలమస్త్రీలు! మంచి సమయంలో యెంతశక్తి వ్యర్థం అయిపోతూవున్నదీ! ఇష్టం లేకపోతే జయించినా మేం బతకం. చచ్చిపోడానికేనా యుద్ధంలోకి వెళ్లనివ్వ మనవోయీ మీ ప్రభువుతోటి."

"ప్రత్యుత్తరం యెందుకు తల్లీ నీకూ? అక్కడ రంగారావు మాట యెంతో యిక్కడ మల్లమ్మమాట అంతే మాకు."

"అయితే యుద్ధంలోకి వెళదాంపద."

"అది రాజాజ్ఞకి వ్యతిరేకం తల్లీ!"

"సరే. ఇంకెందుకూ మరి పోగడడమూ?"

"నేను రావువారి సేవకుణ్ణి కాదుటమ్మా? దొరవారి ఆజ్ఞ అలా వుంది."

"దొరగారి ఆజ్ఞ యేమిటి? ఇది దొరసానిగారి ఆజ్ఞ. వెళ్లి మీదొరని తీసుకురా యిలాగ."

"వచ్చిన పని కాకుండా కళ్లపడ్డానికి ఆజ్ఞ లేదుతల్లీ!"

"అంతే? ఎంత చెప్పినా యేమీ ప్రయోజనం లేదూ? మనం పోయినా లోకం వుంటుంది. తెలుసునా? బొబ్బిలివెలమలు అమానుషచర్య నడిపిన విజయరామున్ణి పొడిచేయ్యలేకపోయా రనీ, ఆపని చెయ్యడానికి స్త్రీలు సిద్ధపడఁగా అడ్డువచ్చా రనీ— తెలుస్తోందా?"

"..........."

"వెంకయ్యా!"

"ఏమి తల్లీ?"

"ఏమంటావు?"

"ఆలస్యం అవుతోంది."

"అలా అన్నావా? అనవూ మరీ? దొరకి తగిన గట్టివోయి నువ్వూ. ఆలస్యం

అయిందికదూ? ఏమంటే యేం చెబుతాను దొరకి? పగవాణ్ణి పొడిచెయ్యవలసిన కైజా రుని పెళ్ళాంమీదకి తిప్పించాడా అని అడిగిం దని చెప్పేం. పట్టుమంటే గుప్పెడుండదు ప్రాణం. దానికోసం కాదుసుమా యీరా ద్ధాంత సిధ్ధాంతాలూ. పగవాడు కాని మాటలనడమూ మగవాడుకానిచేత చెయ్యడమూనూ. ఒళ్ళు మండిపోత్తోం దోయీ! చిత్రవధమేలుసుమీ యింత కంటే! ఆత్మహత్య మహాపాతకం అన్నారు పెద్దలు. బొబ్బిలిరాణి కదే సంభవించింది. పొడిచి పొడిచేసు కుంటే యీదుఃఖమూ, యీతహ తహా లేకపోవును. ఇప్పుడే మను కుంటే యేంవుందీ! రంగారావంతటి వీరుడి పెళ్ళానికి యిలాంటిగతి తప్ప సప్పుడింక యేంవుందీ? బొబ్బిలికోట మీద యిక విజయనగరం జెండా యెగురుతుందా? బతికివుంటే బొబ్బిలి రాణికి భరణమేయిస్తాడు రాజు——"

"అమ్మా!

"ఏమి నాయనా? ఆలస్యం అయిందా? వెలమలకి శత్రుసంహారానికి మల్లమ్మ అడ్డు వచ్చిందికదూ? ఏదీ కైజా రిలాతే. పదునుగావుందా? మీప్రతాపం లాగ మొక్కపోయిందా?"

వెంకయ్యా! ఇంతసేపణ్ణుంచీ వాగేను. ఏంవచ్చిందీ? అయితేలే. పగతీరకుండా చచ్చి పొయేటప్పుడు ఇక యేది యెలా అవుతే నేమీ? ఇదుగో నిన్ను పంపేస్తున్నాను.

నారాయణమూర్తీ! సూర్యచంద్రుల్లారా! బొబ్బిలిదుర్గాధిదేవతా! నాభర్త చెయ్యవలసిన పనిని నాబిడ్డచేత చేయించండి. అంతే చాలు నాకు. అప్పుడేనా నాయాతన పోతుంది.

"కైజారు పదునుగానేవుంది.........శ్రీహరీ!"

వెంకయ్యా! నాదేవుడికి నానమస్కా రాలు చెప్పవోయి! మంచీచెడ్డా చెప్పేదే కాని చివరికి మల్లమ్మా ఆజ్ఞని జవదాటేది కాదని చెప్పు. కైజారు పదునుగానే వుంది. లేకపోయినా సాహసం వుంటే తడిపాతే చాలుతుంది యెంతకేనా. శ్రీహరీ!"